క్లుప్తంగా

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నంద్యాల(సిటీ): కురుస్తున్న భారీ వర్షాలకు కుందూ నది, మద్దిలేరు వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయని నంద్యాల 1వ వార్డు పీవీ నగర్, హరిజనవాడ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. గురువారం కుందూ నది, మద్దిలేరు వాగు పరివాహక ప్రాంతాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, మద్దిలేరువాగు గుండా ప్రయాణించే వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మాన్యం కౌలుకు వేలం

రుద్రవరం: పేరూరు ఈశ్వర,రామ,ఆంజనేయ స్వామి వార్ల ఆలయాలకు చెందిన మాన్యం కౌలుకు గురువారం దేవాదాయ శాఖ ఈఓలు నర్సయ్య, సాయి జయచంద్రారెడ్డి వేలం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆయా దేవాలయాలకు సంబంధించిన 75.68 ఎకరాలకు స్థానికులతో పాటు బి.నాగిరెడ్డిపల్లె గ్రామాల రైతులు డిపాజిట్లు చెల్లించి వేలం పాల్గొన్నారు. గతేడాది రూ.6.20 లక్షలు రాగా ఈ ఏడాది రూ.6.64 లక్షల ఆదాయం వచ్చినట్లు చెప్పారు. సర్పంచు కోనేటి దేవదానం, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

హుండీ సొమ్ము లెక్కింపు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గుడిపాటిగడ్డ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి, మల్లికార్జున స్వామి దేవస్థానం, శ్రీకృష్ణ భజన మందిరంలో గురువారం ఆలయ ఈఓలు లక్ష్మీనారాయణ, రామాంజనేయశర్మ ఆధ్వర్యంలో హుండీ కానుకల లెక్కింపు గురువారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆరు నెలలకు సంబంధించి శ్రీలక్ష్మీవేంకటేశ్వరదేవస్థానం హుండీ నుంచి రూ.1,77,270, మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఏడాదికి గాను రూ.51,125, శ్రీకృష్ణభజన మందిరంలో రూ.11,145 సంవత్సరం పాటు ఆదాయం లభించిందని వివరించారు.

వ్యాసరచన పోటీలు

ఆళ్లగడ్డ: అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా గురువారం అహోబిలం, ఆళ్లగడ్డ గిరిజన ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులకు అహోబిలం అటవీ అధికారి ముర్తుజావలి ఆధ్వర్యంలో వకృత్వ, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ఈ నెల 29న బహుమతులు అందజేస్తామని చెప్పారు. ఎఫ్‌బీఓలు రామకృష్ణ, నాగేంద్రయ్య ఉన్నారు.

చాగలమర్రి: ఈ నెల 29వ తేదీన ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా స్థానిక కేజీబీవీ ప్రిన్సిపాల్ సునీత ఆధ్వర్యంలో డి.వనిపెంట సెక్షన్ అధికారి పెద్దన్న విద్యార్థులకు పులులు వాటి ప్రాముఖ్యతపై వ్యాసరచన, వకృత్వ పోటీలను గురువారం నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఎఫ్‌బీఓలు మదన గోపాల్, సుభాష్, నగేష్,నర్సయ్య పాల్గొన్నారు.

పెద్దపులికి హాని తలపెట్టొద్దు

రుద్రవరం: పెద్దపులులకు హాని తలపెట్టరాదని రుద్రవరం ఎఫ్ఎస్ఓ శ్రీనివాసరెడ్డి అన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఆయన అటవీ ప్రాంతానికి సమీంలోనున్న రెడ్డిపల్లె, పందిర్లపల్లె, అప్పనపల్లె గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎఫ్‌బీఓలు ఖాన్,నరేంద్ర గౌడ్ ఉన్నారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

శిరివెళ్ల: ఈ నెల 28వ తేదీన మండలంలోని గోవిందపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తామని ఇందులో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి పాల్గొంటారని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. గ్రామంలోని 1వ గ్రామ సచివాలయ పరిధిలో ఇంటింటికీ తిరిగి పథకాల అమలు తీరు, లబ్ధి, సమస్యల గురించి తెలుసుకుంటారని చెప్పారు. మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నాలని కోరారు.

పంచాయతీలకు నిధుల మంజూరు

గోస్పాడు: మండలంలోని గ్రామ పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయని ఈఓఆర్‌డీ అనసూయ తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను.. దీబగుంట్ల రూ.2,71,348, గోస్పాడు రూ.2,67,757, జిల్లెల్ల రూ.3,06,292, జూలేపల్లె రూ.1,38,262, కానాలపల్లె రూ.1,35,698, ఎం.చింతకుంట్ల రూ.87,942, ఎం.కృష్ణాపురం రూ.1,18,350, నెహ్రూనగర్ రూ.1,98,697, పసురపాడు రూ.1,32,865, రాయపాడు రూ.41,882, ఎస్.నాగులవరం రూ.58,578, సాంబవరం రూ.1,63,079, తేళ్లపురి రూ.60,172, ఒంటివెలగల రూ.99,932, యాళ్లూరు రూ.8,07,714 నిధులను కేటాయించినట్లు చెప్పారు.

అందుబాటులో కిసాన్ సేవలు

దొర్నిపాడు: ఇక నుంచి సహకార సంఘంలో కిసాన్ సమృద్ధి సేవలు అందుబాటులోకి రానున్నాయని కోవెలకుంట్ల ఏడీఏ సుధాకర్ తెలిపారు. గురువారం మండలంలోని గుండుపాపల సహకార సంఘంలో పీఎం కిసాన్ సమృద్ధి సేవలను సొసైటీ చైర్మన్ బాలవెంకటరెడ్డి అధ్యక్షతన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, భూసార పరీక్షలు, నానో డీఏపీ, సల్ఫర్ కోటెడ్ యూరియా అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఏఓ సునీత, సీఈఓ సుబ్బారావు, ఇఫ్‌కో జిల్లా సేల్స్‌మేనేజర్ మధుబాబు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి చాందిని పాల్గొన్నారు.

నిషేధిత మందుల అమ్మకం

చాగలమర్రి: నిషేధించిన గడ్డి నిర్మూలన రసాయనిక మందును ముత్యాలపాడు గ్రామంలోని ఒక పెస్టిసైడ్స్ దుకాణం నుంచి కొనుగోలు చేసి ఓ రైతు తన పొలంలో పిచికారీ చేస్తున్న సంఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. 20 లీటర్ల మందును రూ.12వేలకు కొనుగోలు చేసినట్లు రైతు తెలిపాడు.



గ్లైసిల్ మందు, పవర్ స్ప్రేయర్‌తో వెళ్తున్న రైతు

ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లే బాధ తప్పింది



ఇక్కడ దొర్నిపాడు పీహెచ్‌సీ పరిధిలోని కంపమల్ల విలేజ్ క్లినిక్‌లో ఫ్యామిలీ సర్జన్ ద్వారా వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఈమె నాగప్రసన్న. ఏడో నెల గర్భిణి. గతంలో గర్భిణి అని తెలిసినప్పటి నుంచి పది రోజులకొకసారి 50 కి.మీ దూరంలో ఉన్న నంద్యాల ప్రైవేటు వైద్యశాలకు కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాల్సి వచ్చేది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొత్తగా ఏర్పాటు చేసిన విలేజ్ క్లినిక్ ద్వారా గడప దాటకుండా, ఎలాంటి వ్యయప్రయాసలు లేకుండా..ప్రతి రెండు వారాలకొకసారి వైద్యులు ఇంటికే వచ్చి వైద్యపరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేసి వెళ్తున్నారు. అన్ని సేవలు ఊర్లోనే ఉచితంగా అందుతుండటంపై ఆమె సంతోషం వ్యక్తం చేస్తోంది.

కాన్పుకు ఒక్క రూపాయి కూడా ఖర్చు కాలేదు..



ఈ ఫొటోలో బిడ్డను చూపుతున్న ఈ బాలింత పేరు నేరెళ్ల రాణి, జమ్ములదిన్నె గ్రామం. తాను ఇంతకు ముందు గర్భిణి అయినప్పటి నుంచి కాన్పు వరకు ప్రైవేట్ ఆసుపత్రులకు తిరిగాను. కేవలం కాన్పు అయి ఇంటికి వచ్చే సరికి రూ.30 వేలకు పైగా ఖర్చయ్యాయి. ఈసారి గర్భిణి అని నిర్ధారణ అయినప్పటి నుంచి మా ఊర్లోని వెల్‌నెస్ సెంటర్‌లో నెలకు రెండుసార్లు డాక్టర్లు వచ్చి వైద్య పరీక్షలు ఉచితంగా చేసి అవసరమైన మందులు అందజేశారు. ఆళ్లగడ్డ ఆసుపత్రిలో ప్రసవం కాగా.. ఒక్క రూపాయి కూడా ఖర్చుకాలేదని, చాలా డబ్బులు మిగిలాయని సంతోషంగా చెబుతోంది.

ఆరోగ్య భాగ్యం

వైద్యం..ఖర్చుతో కూడుకున్నదని పల్లెవాసుల భావన. సర్కారు దవాఖానాకు వెళ్తే సరిగా వైద్యం చేయరని వారి మనస్సుల్లో బలంగా నాటుకుపోయింది. దీంతో వేల రూపాయలు ప్రైవేట్ వైద్యశాలల్లో వెచ్చించి ఆరోగ్యం బాగు చేయించుకుంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకం పెరిగేలా.. ముసురుకున్న అపవాదులను తొలగించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వైఎస్సార్ విలేజ్ క్లినిక్ పేరుతో పల్లెల్లో సొంత భవనాలు నిర్మించి, ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉంచి నాణ్యమైన వైద్యం అందేలా ఏర్పాట్లు చేసింది. గతేడాది నుంచి ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు వ్యయప్రయాసలు లేకుండా ఇంటి వద్దకు వచ్చి ఉచితంగా వైద్యసేవలందిస్తున్నారు. దీంతో గ్రామీణుల్లో సర్కారు వైద్యం పట్ల నమ్మకం పెరిగింది.

- పల్లె ముంగిట నాణ్యమైన వైద్యం
- మినీ పీహెచ్‌సీలుగా వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు
- 'ఫ్యామిలీ డాక్టర్'తో వైద్య సేవలు మరింత చేరువ
- గ్రామీణులకు తగ్గిన వ్యయ ప్రయాసలు



జి.జమ్ములదిన్నెలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్



చింతకొమ్మదిన్నెలో ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఆళ్లగడ్డ : పేదల వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది. నాడు – నేడు పథకంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల రూపురేఖలను పూర్తిగా మార్చేసింది. వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అమలు చేసింది. 108, 104 వాహనాలను మరిన్ని అందుబాటులోకి తెచ్చింది. ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల్లో 13 పీహెచ్‌సీలతో పాటు 81 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. విలేజ్ క్లినిక్ ద్వారా 12 రకాల ఆరోగ్య సేవలతో పాటు 14 రకాల వైద్య పరీక్షలు, 105 రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. నియోజకవర్గంలో ఇప్పటి వరకు సుమారు 80 వేల మంది వైద్య సేవలు పొందారు. 13 పీహెచ్‌సీ పరిధిలో 81 గ్రామ సచివాలయాల కింద సుమారు 3.75 లక్షల మంది జనాభాకు వైద్య సేవలందతున్నాయి.

నాణ్యమైన వైద్య సేవలు..

వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లో 12 రకాల వైద్యసేవలు అందిస్తున్నారు. గర్భిణులు, పిల్లలకు అవసరమైన వైద్య పరీక్షలతో పాటు చికిత్సలు అందిస్తారు. నవజాత శిశువులకు, కిశోర బాలలకు ఆర్యో సేవలు, కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలకు మహిళలను ప్రోత్సహించడం, సీజన్ వ్యాధుల నిరోధానికి చర్యలు, ఓపీ సేవలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల స్క్రీనింగ్‌తో పాటు వాటి నివారణకు చర్యలు, ఈఎన్‌టీ, మానసిక సమస్యలు ఉన్న వారికి స్క్రీనింగ్, అగ్ని ప్రమాదంలో గాయపడిన తదితర వారికి సేవలు అందిస్తున్నారు.

14 రకాల వైద్య పరీక్షలు..

వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లకు వచ్చే వారికి 104 వాహనంలోని మెడికల్ ల్యాబ్‌లో హెచ్‌బీ (హిమోగ్లోబిన్), హెచ్‌సీజీ (యూరిన్ టెస్ట్), యూరిన్ టెస్ట్ ఫర్ పీహెచ్, బ్లడ్ షుగర్, మలేరియా, హెచ్ఐవీ, డెంగీ, ఎసిటిక్ యాసిడ్ టెస్ట్ ఫర్ ఐయోడిన్ ఇన్‌సాల్ట్, వాటర్ టెస్టింగ్, హెచ్‌బీఎస్ఏజీ, సిఫిలిస్, ఏఎఫ్‌బీ, విజన్ తదితర టెస్ట్‌లు చేసి వెంటనే రిపోర్ట్ అందజేస్తారు.

105 రకాల మందులు

వివిధ రాకల జబ్బుతో వచ్చే ప్రజలకు అందజేసేందుకు అత్యధికంగా ఉపయోగించే అల్బెండజోలమ్, ఎమక్సిన్, అమ్లాపిడస్, ఎటిన్‌లాల్, బీ కాంప్లెక్స్, కాల్షియం, సిప్రొఫ్లాక్సిన్, కోమోట్రోజోల్, డైజోఫామ్, డైక్లోఫినాక్, డైసైకోమి న్, డొమిరిడోన్, ఫ్లూకొనజోల్, షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులకు అవసరమైన గ్లిమిపిరి డ్, మెట్ ఫార్మిన్, టెల్‌మికిండ్, ఐరన్ ఫ్లోరిక్ యాసిడ్‌తో పాటు అనేరకాల సిరఫ్‌లు, సూది మందులు, సెలెన్ బాటిళ్లు తదితర 105 రకాల మందులు విలేజ్ క్లినిక్‌లో నిత్యం అందుబాటులో ఉంటున్నాయి.

తలుపు తట్టి.. నాడి పట్టి..

గ్రామీణ ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందించడలో భాగంగా గతేడాది అక్టోబర్‌లో 'ఫ్యామిలీ డాక్టర్' కాన్సెప్ట్ అమల్లోకి తెచ్చారు. ఇందులో భాగంగా నియోజవర్గంలోని 81 గ్రామ సచివాలయాల పరిధిలో ప్రతి నెలా రెండు రోజులు ఆరోగ్య శ్రీలో శస్త్రచికిత్స చేయించుకున్న వారికి, క్యాన్సర్, పక్షవాతం, వివిధ రకాల ప్రమాదాలకు గురైన వారితో పాటు ఇతర దీర్ఘకాలిక జబ్బులతో మంచానికే పరిమితమైన రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నారు.

నియోజకవర్గంలో ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ఇప్పటి వరకు అందించిన వైద్య సేవలు..

మొత్తం పీహెచ్‌సీల సంఖ్య	- 13
వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు	- 81
వైద్య సేవలు పొందిన వారు	-78,962
సాధారణ ఓపీ	- 54,754
కౌమార దశ	- 53
గర్భిణులు	- 3,551
బాలింతలు	- 2,546
అనిమియా	- 450
బీపీ	- 6,764
షుగర్	- 4,972
బీపీ మరియు షుగర్	- 5,658
ఓరల్ క్యాన్సర్	- 51
బ్రెస్ట్ క్యాన్సర్	- 30
గర్భాశయ క్యాన్సర్	- 71
టీబీ - 62	
రోజుకు సగటున పరీక్ష చేయించుకుంటున్న వారు	- 1,200

ఉత్తమ ఫలితాలు



గతంలో ఏ చిన్న జబ్బు చేసినా గ్రామంలో ఉండే ఆర్ఎంపీనో లేక పట్టణంలోని ప్రైవేటు వైద్యులను ఆశ్రయించేవారు. దగ్గరలోనే ఉండే పీహెచ్‌సీలకు గాని, ఆరోగ్య ఉప కేంద్రాలకు గాని వచ్చేవారు కాదు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ప్రారంభించినప్పటి నుంచి ప్రభుత్వ వైద్యంపై గ్రామాల్లో నమ్మకం పెరిగింది. ప్రభుత్వం ఆశించినట్లుగానే ఉత్తమ ఫలితాలు వస్తున్నాయి.

– డాక్టర్ నాగమస్తాన్, వైద్యాధికారి, అహోబిలం పీహెచ్‌సీ

ప్రజల గుండెల్లో సంక్షేమం, ప్రగతిని నింపేశాం



టి.లింగందిన్నెలో లబ్ధిదారుకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల

రుద్రవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా ప్రజల గుండెల్లో సంక్షేమాన్ని నింపామని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా టి.లింగందిన్నె గ్రామంలో పర్యటించారు. నాలుగేళ్లలో అమలు చేసిన పథకాలను గడప గడపకు తిరిగి లబ్ధిదారులకు వివరించి బుక్‌లెట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇచ్చిన హామీల్లో 95 శాతానికి పైగా అమలు చేసిన ఘనత వైఎస్సార్‌సీపీ దేనన్నారు. ప్రజలు.. టీడీపీ నాయకులు ఇళ్ల వద్దకు తిరిగి పథకాలను తీసుకోవాల్సిన దుస్థితి నుంచి గడప వద్దకే అందేలా జగనన్న పాలన సాగిస్తున్నారన్నారు. ఒక్క రోజులో అభివృద్ధి జరగదని అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియన్నారు. మార్కెట్‌యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, ఏఈలు, వివిధ శాఖల అధికారులు, నాయకులు మోహన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, హరినారాయణ, బద్రి ఎర్రన్న, శ్రీను, తిరుపతి రెడ్డి, ప్రసాదరెడ్డి, వెంకటన్న, పాణ్యం నాగేష్, జయరాముడు, గొడుగు నారాయణ పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష.. : ఆర్.నాగులవరం గ్రామ సచివాలయ పరిధిలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగిసింది. ఈ సందర్భంగా గ్రామస్తులు వీధిలైట్లు, అంతర్గత రహదారులు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు వంటి సమస్యలు ఆయన దృష్టికి తెచ్చారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్.నాగులవరం, టి.లింగందిన్నె గ్రామాల్లో రూ.20లక్షలతో అభివృద్ధి పనులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

జగనన్న సురక్షకు అపూర్వ స్పందన



శిరివెళ్లలో సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎంపీపీ

ఆళ్లగడ్డ: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు లబ్ధి చేకూర్చడమే 'జగనన్న సురక్ష' లక్ష్యమని ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్ అన్నారు. మండలంలోని బత్తలూరు గ్రామ సచివాలయ పరిధిలో గురువారం 'జగనన్న సురక్ష' క్యాంపు నిర్వహించారు. ఈఓఆర్డీ తాహెర్‌హుసేన్ ఉన్నారు.

ఉయ్యాలవాడ : రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమానికి మండలంలో అపూర్వ స్పందన లభించింది. ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు గ్రామంలోనే అందజేయడంతో హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. గురువారం చివరి రోజు సర్పంచ్‌లు ఇరిగెల లక్ష్మిపద్మజ, చాబోలు లక్ష్మీదేవి, ఉప సర్పంచ్‌లు కందుల వెంకటసుబ్బారెడ్డి, రాజేశ్వరరెడ్డి అధ్యక్షతన కొండుపల్లె గ్రామంలో అధికారులు కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 11 సచివాలయాల పరిధిలో 9,435 కుటుంబాలను వలంటీర్లు సర్వే చేయగా.. అధికారులు 1,659 మందికి ధ్రువ పత్రాలు అందజేశారు. జెడ్పీటీసీ కసాని పుణ్యలక్ష్మీదేవి, ఎంపీపీ బుద్ధా భాగ్యమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు కపురం శివమ్మ, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు 109 మందికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్, పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ రహీమ్, నాయకులు కపురం శ్రీనివాసరెడ్డి, తులసిరెడ్డి పాల్గొన్నారు.

రుద్రవరం: స్థానిక గ్రామ సచివాలయం వద్ద ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దారు రవీంద్ర ప్రసాదు తదితర శాఖల అధికారులు గురువారం సర్పంచు బైరి విజయలక్ష్మి అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా అధికారులు 325 మందికి ధ్రువ పత్రాలను అందజేశారు. ఎంపీపీ బాలస్వామి, పశు వైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్, ఏఈలు వెంకటరాముడు,ప్రమోద్, మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ పాల్గొన్నారు.

చాగలమర్రి: జగనన్న సురక్ష కార్యక్రమం అర్హులైన లబ్ధిదారులకు వరం లాంటిదని కొత్తపల్లె గ్రామ సర్పంచ్ ఈశ్వర్‌రెడ్డి అన్నారు. ఆయన కొత్తపల్లె గ్రామానికి మజరా గ్రామమైన డి.వనిపెంట గ్రామంలో గురువారం ఎంపీడీఓ మహబూబ్ దౌలా అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేసి 153 మందికి ధ్రువ పత్రాలు పంపిణీ చేశారు. ఉప సర్పంచ్ శ్యామల, ఎంపీటీసీ శంకరిబాయి, ఎఓ రంగ నేతాజీ, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, ఏపీఓ నిర్మలాదేవి పాల్గొన్నారు. అలాగే.. గొడిగనూరు గ్రామంలో తహసీల్దారు సుభద్రమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 113 మందికి ధ్రువ పత్రాలు అందజేశారు. సర్పంచ్ సంజీవరాయుడు, ఎంపీటీసీ పత్తినారాయణ పాల్గొన్నారు.

శిరివెళ్ల: జగనన్న సరక్ష ఒక బృహత్ కార్యక్రమమని ఎంపీపీ నాయక్ వసీం అన్నారు. గురువారం స్థానిక 3వ గ్రామ సచివాలయంలో జగనన్న సరక్ష శిబిరం జరిగింది. 738 మందికి పత్రాలను ప్రజలకు అందచేశారు. అలాగే యర్రగుంట్ల 1వ గ్రామ సచివాలయంలో 220 మందికి ధ్రువ పత్రాలను ప్రజలకు అందజేశారు. సర్పంచులు లక్కాకుల సాలమ్మ, అయ్యలూరు సుభహాన్, ఉప సర్పంచులు ఇంతియాజ్, సత్తార్ ప్రతాప రెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షుడు గాజ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ నసీమూన్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ షేక్ మొయిద్దీన్, ఏఓ సుధాకర్, ఈఓఆర్డీ నాగేంద్ర పాల్గొన్నారు.

గోస్పాడు: మండలంలోని యాళ్లూరు గ్రామంలో గురువారం ఎంపీడీఓ భాస్కర్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయశేఖర్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ ఆర్థర్‌సైమాన్ మాట్లాడుతూ ప్రజలకు ఇంటి వద్దకే పథకాలు, ప్రభుత్వ సేవలు అందజేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఈ సందర్భంగా 511 వివిధ ధ్రువ పత్రాలు పంపిణీ చేశారు.వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శకుంతలమ్మ, సర్పంచ్ రత్నమ్మ, ఉప సర్పంచ్ బెక్కెం నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కుందూనదిలో చేపలు మృత్యువాత



మృత్యువాతపడి ఒడ్డుకు చేరిన చేపలు

ఉయ్యాలవాడ : తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు కుందూనదిలో ఎగువ ప్రాంతాల నుంచి వర్షపు నీరు, మురుగు నీరు ప్రవహిస్తోంది. గురువారం నదిలో కొట్టుకొచ్చిన గుర్రపుడెక్క నదిని కప్పేశాయి. ఎంతాల అంటే కనీసం నదిలో ఎంత నీరు కనిపిస్తోందో కూడా కనిపించనంతగా గుర్రపుడెక్క కొట్టుకొస్తోంది. అలాగే ఎగువ ప్రాంతాల్లోని కలుషిత నీరు నదిలో కలవడంతో చేపలు మృతువాత పడుతున్నాయి. దీంతో నదీతీర ప్రాంతం దుర్వాసన వెదజల్లుతోంది. నదిలో భారీగా చేపలు చనిపోవడంతో నదితీర గ్రామాలైన అల్లూరు, హరివరం, ఉయ్యాలవాడ, కాకరవాడ, బోడెమ్మనూరు, సుద్దమల్ల, రూపనగుడి, మాయలూరు, నర్సిపల్లె, పెద్దయమ్మనూరు, ఆర్.జంబులదిన్నె, ఒంటెద్దుపల్లె, ఇంజేడు గ్రామాలకు ఓవర్‌హెడ్ ట్యాంకుల నుంచి కుళాయిలకు సరఫరా చేసే నీటిని నిలిపివేశారు. దుర్వాసన వస్తుండడంతో పశువులు కూడా నీరు తాగడం లేదని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఈ విషయమై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫణీత్‌కృష్ణతో మాట్లాడగా.. నదిలో ప్రవహిస్తున్న నీటిని ల్యాబ్‌కు పంపామని చెప్పారు. ఇందులో ఎంతమేర కలుషితమైందని, ఏఏ రసాయనాలు కలిశాయో తెలుస్తాయన్నారు. తీరం వెంట వున్న 14 గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసేందుకు కార్యదర్శులకు, సచివాలయ ఉద్యోగులకు సూచనలు చేశామని తెలిపారు.



సాగుకు సిద్ధమవుతున్న వరి నారు



ఎర్రగుడిదిన్నె చెరువు ఆయకట్టు పొలాల్లో కళకళలాడుతున్న మినుము పైరు

నిండుకుండలా కుందూ

దొర్నిపాడు: భారీ వర్షాలకు కుందూ నది నిండుకుండలా ప్రవహిస్తుంది. ఇన్నాళ్లుగా చుక్కనీరు లేక ఒట్టిపోయిన నది..వరదనీరు చేరికతో జలకళ ఉట్టిపడుతోంది. దీంతో రైతులు వరిసాగుకు సన్నద్ధం అవుతున్నారు. కుందూ పరిధిలో ఏటా రైతులు రెండుకార్లు వరి పంట సాగు చేస్తారు. ఇటీవల అధికారులు వర్షాధారిత పంటలు వేసుకోవాలని సూచించడంతో చాలా మంది రైతులు వరినార్లు కూడా పోసుకోలేదు. ప్రస్తుతం నీరు పుష్కలంగా ఉండటంతో కుందూ కింద వరినార్లు చల్లే పనిలో నిమగ్నమయ్యారు. ఇప్పటి వరకు మండలంలో 126.4 మి.మీ వర్షపాతం నమోదైందని తహసీల్దార్ జయప్రసాద్ గురువారం తెలిపారు. గురువారం ఒక్కరోజే 49.4 మి.మీ వర్షపాతం నమోదైనట్లు చెప్పారు.

రుద్రవరం: మండలంలో గురువారం ఉదయం వరకు కురిసిన వర్షానికి వాగులు, వంకలు ఉప్పొంగాయి. రైతులు సాగు చేసిన మినుము,మొక్కజొన్న,పత్తి వంటి పంటలు కళకలాడుతున్నాయి. ఎర్రగుడిదిన్నె, పేరూరు, చిలకలూరు గ్రామాల పరిధిలో చెరువుల ఆయకట్టు, మెట్ట పొలాలలో రైతులు దాదాపు 500 ఎకరాల్లో మినుము పంట సాగు చేశారు. అలాగే రుద్రవరం,పెద్ద కంబలూరు,డీ.కొట్టాల, శ్రీరంగాపురం,ఎల్లావత్తుల,నర్సాపురం,ఆలమూరు,చిత్రేనిపల్లె, ముకుందాపురం తదితర గ్రామాల పరిధిలో వేలాది ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు.కురిసిన వర్షానికి ఆ పంటలు పచ్చదనం పులుముకున్నాయి.

కళారాధన పోటీల తేదీ మార్పు

నంద్యాల(వ్యవసాయం): కళారాధన నంద్యాల సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే మాతృభూమికి కళార్చన పోటీలు ఆగస్టు నుంచి కాకుండా రిపబ్లిక్‌డే దినోత్సవం నుంచి ప్రారంభిస్తున్నట్లు కళారాధన ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవికృష్ణ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఆగస్టు 1– 15వ తేదీ వరకు 21సంవత్సరాలుగా నిర్వహించే మాతృభూమికి కళార్చన రాయలసీమ స్థాయి పాఠశాల విద్యార్థుల పోటీల వివరాలను డిసెంబర్‌లో ప్రకటిస్తామని పేర్కొన్నారు.

నంద్యాలలో ముగిసిన జగనన్న సురక్ష



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

నంద్యాల(సిటీ): సచివాలయ వ్యవస్థతో పరిపాలన మరింత చేరువైందని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో 5 సచివాలయాలకు సంబంధించి జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 36వ వార్డు రామనాథరెడ్డి నగర్, 39వ వార్డు రోజాకుంట, బైర్మల్‌స్ట్రీట్, సీలివీధి, తెలుగుపేట ప్రాంతాలకు సంబంధించి 4,380 దరకాస్తులకు గాను 4,334 టోకన్లు జారీ కాగా 4,222 మందికి రిజిస్ట్రేషన్లు పూర్తి చేశామన్నారు. పట్టణంలో సుమారుగా 29,222 మంది ధ్రువపత్రాలకు దరకాస్తు చేసుకోగా 18,931 మందికి సరిఫికెట్లు అందించామన్నారు. అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, ఏపీఎస్పీడీసీఎల్ రాష్ట్ర డైరెక్టర్ శశికళారెడ్డి, కౌన్సిలర్లు వెంకటలక్ష్మి, పున్నారాజేశ్వరి, శిరీష, వార్డు ఇన్‌చార్జ్‌లు కిరణ్ కుమార్, పూర్ణిమ,సత్యం, జయప్రకాష్ రెడ్డి, లక్ష్మీనారాయణ, పున్నా శేషయ్య, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, ఎంఈఈ రమణమూర్తి, డీఈఈ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

చాగలమర్రి: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మొహర్రం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ రమణయ్య సూచించారు. స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో గురువారం సాయంత్రం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ పండుగ సందర్భంగా ఎవరైన శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతి భద్రతలను పర్యవేక్షించేందుకు జిల్లా కేంద్రం నుంచి ప్రత్యేక దళాలను తెప్పిస్తున్నట్లు చెప్పారు. లాల్ స్వామి కమిటీ సభ్యులు, హిందూ, ముస్లిం ప్రముఖులు పాల్గొన్నారు.

రెయిన్‌కోట్‌ల అందజేత

నంద్యాల(సిటీ): మున్సిపాలిటీలో విధులు నిర్వర్తించే పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్ కోట్‌లను 4వ వార్డు కౌన్సిలర్ ఎస్.తబ్రేజ్ పంపిణీ చేశారు. గురువారం స్థానిక సచివాలయం వద్ద కో ఆప్షన్ సభ్యుడు పడకండ్ల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పలువురు కార్మికులకు రెయిన్ కోట్‌లు అందించారు. రామయ్య, రసూల్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

గోస్పాడు: గ్రామ సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించాలని ఎంపీడీఓ భాస్కర్ అన్నారు. మండలంలోని ఒంటివెలగల, ఎం.కృష్ణాపురం గ్రామాల సచివాలయాలను గురువారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు డ్రస్ కోడ్ పాటించాలని సూచించారు. స్పందన, గ్రీవెన్స్, జనరల్ స్పందన రిజిస్టర్‌లో ప్రజల దరఖాస్తుల వివరాలను నమోదు చేయాలని చెప్పారు. రోజూ సాయంత్రం 3 నుంచి 5గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు.

ఆదర్శమూర్తి అబ్దుల్ కలాం



కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

ఆళ్లగడ్డ: ప్రపంచం మెచ్చిన మేధావి అబ్దుల్‌కలామ్ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని తహసీల్దార్ హరినాథరావు, పట్టణ ఎస్ఐ వెంకటరెడ్డి, డాక్టర్ రాంగోపాల్ రెడ్డి సూచించారు. మాజీ రష్ట్రపతి అబ్దుల్‌కలామ్ వర్ధంతి సందర్భంగా పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురుగానున్న కలామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

నంద్యాల(వ్యవసాయం): మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్‌కలాం వర్ధంతిని పురస్కరించుకొని గురువారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జిల్లా చైర్మన్ దస్తగిరి, కోశాధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ స్థానిక మాస్టర్ పబ్లిక్ స్కూల్‌లో ఉచిత మెడికల్ క్యాంపును ఏర్పాటు చేసి బీపీ, షుగర్‌కు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశామన్నారు. సభ్యులు ఉస్మాన్‌బాషా, చైత న్య, నాగేశ్వరరెడ్డి,సోహెల్,రాజునాయక్ పాల్గొన్నారు.

గుర్రంపై అలీ అక్బర్ పీరు ఊరేగింపు




చాగలమర్రి: చిన్నమకానం వీధిలోని అరబ్ మస్జిద్ సమీపంలో కొలువైన శ్రీఅలీ అక్బర్ పీరును గురువారం రాత్రి వేల మంది భక్తుల దివిటీల వెలుగులో గుర్రంపై ఊరేగింపుంచారు. సంప్రదాయ మేళ తాళాలతో చిన్నమకానంలో ప్రారంభమైన ఊరేగింపు పెద్దమకానం, మొయిన్ బజారు, పాతబస్టాండులోని నిర్వాహకుల ఇళ్ల వరకు వెళ్లి తిరిగి చిన్నమకానంలో కొలువుదీరింది.

రుద్రవరం: మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో మొహర్రం పూజలు కొనసాగుతు న్నాయి. ఆయా గ్రామాల్లోని చావిళ్లలో నిర్వాహకులు పీర్లను కొలువు దీర్చి ప్రత్యేకంగా అలంకరించారు. ప్రజలు ప్రత్యేక ఫాతెహాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారు. గురువారం ఉదయం మండల కేంద్రంలో పీర్లను గ్రామంలో ఊరేగించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

బొమ్మలసత్రం: నింబంధనలు అతిక్రమించి అధిక ధరలకు మద్యం విక్రయించినా, నిర్దేశిత బ్రాండ్లు విక్రయించకపోయినా చర్యలు తప్పవని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి రవికుమార్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం పట్టణంలోని పలు మద్యం దుకాణాలు, కల్లు దుకాణాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఎస్ఐలు అస్లాంబేగ్, శ్రీనివాసులు, సందీప్ ఉన్నారు.



బొమ్మలసత్రం వద్దనున్న వైన్‌షాప్‌లో స్టాక్‌ను పరిశీలిస్తున్న రవికుమార్‌రెడ్డి